కలెక్టరేట్ ఎదుట వామపక్షాల నిరసన

బడులకు వేళాయె..

సర్కారు బడుల్లో సమస్యలు తిష్ట
ఇంకా పూర్తిగా చేరని పాఠ్య పుస్తకాలు
కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు దోపిడీ
నేటినుండి పాఠశాలలు పునః ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు సోమవారం నుండి తెరుచుకోనున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో మాత్రం అనేక సమస్యలు తీష్ట వేసి ఉన్నాయి. విద్యార్థులకు ఇంకా పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందలేదు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోతతో విద్యార్థుల తల్లిదండ్రులపై యాజమాన్యాలు భారం మోపనున్నాయి. కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో 1478 ఉండగా, 738 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 2,90,641 విద్యార్థులు ఉండగా ప్రైవేట్ పాఠశాలల్లో1,45,112 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠశాలలు తెరిచే నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను సరఫరా చేస్తామని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. 2,92,955 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా కానుక కిట్ల వస్తువులను చేర్చారు. జిల్లాలోని విద్యార్థులకు దాదాపుగా 20 లక్షలకు పైగా పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా కేవలం 10 లక్షల మాత్రమే వచ్చాయి. మిగిలిన 10 లక్షల పాఠ్యపుస్తకాలు ఇంకా రావాల్సి ఉంది. అనగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు కూడా లేకపోవడంతో ప్రతి ఏడాది తీరా ఇబ్బందులు పడుతున్నారు. నాడు నేడు కింద చేపట్టిన పాఠశాలలో మినహా మిగిలిన పాఠశాలల్లో ఇంకా పూర్తిస్థాయిలో వసతులు లేనటువంటి పరిస్థితి నెలకొంది. విద్యార్థులు అసౌకర్యాల నడుమనే గతేడాది విద్యా సంవత్సరంలో విద్యాబోధన ముగింప చేశారు. ఈ ఏడాది అయినా విద్యార్థులకు పూర్తిస్థాయిలో వసతుల కల్పన చేపట్టి మెరుగైన విద్యాబోధన అందించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల్లో దందా: జిల్లాలోని కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో ఫీజుల మోత మోగించారు. గ తేడాదితో పోలిస్తే ఏడాది ఏకంగా 30శాతం ఫీజులను పెంచేశారు. ఫీజులతోపాటు స్కూల్ డ్రెస్ పుస్తకాలు వాటికి కూడా అధికంగా వేలకు వేలు రూపాయలు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎల్‌కెజి విద్యార్థికి ఏకంగా రూ.50 వేలకు పైగా వార్షిక ఫీజును వసూలు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో పెరిగిన ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులు తలమనుకులవుతున్నారు. ఫీజుల నియంత్రణ చట్టం ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేకపోయినప్పటికీ విద్యార్థుల నుండి వేలకు వేలు ఫీజులను వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రణాళిక

- డాక్టర్ వెంకట రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి

ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఇప్పటినుండే ప్రణాళిక రూపొందించాం. ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పూర్తి చేసి అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధన అందేలా కృషి చేస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు అన్ని పాఠశాలకు పంపించాం. జగనన్న విద్యా కానుక కిట్లను కూడా విద్యార్థులకు అందజేసేందుకు అన్ని పాఠశాలలకు చేరవేశం. ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేసినట్లు తమ దష్టికి విద్యార్థులు తల్లిదండ్రులు తీసుకొని వస్తే తగు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే పాఠశాలల్లో ఫీజులను వసూలు చేయాలి.

అమిత్‌షా గో బ్యాక్

కలెక్టరేట్ ఎదుట వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విభజన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రంలోని విశాఖఉక్కు పరిశ్రమను అమ్మడానికి పూనుకున్న హోం మంత్రి అమిత్‌షా గో బ్యాక్ అంటూ వామపక్షాలు పిలుపునిచ్చాయి. ఆదివారం విశాఖ నగరంలో జరుగు బహిరంగ సభలో పాల్గొనడానికి వస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా (మా రాష్ట్రానికి రావద్దు) గో బ్యాక్ అను నినాదంతో వాపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదటు గాంధీ విగ్రహం దగ్గర నిరసన తెలిపారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగినసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్. రాధా కృష్ణ, సిపిఐ నగరసహాయ కార్యదర్శి డి.శ్రీనివాస రావు, సిపిఐఎం జిల్లా నాయకులు నరసింహులు, వెంకటేశులు మాట్లాడారు. కేంద్రంలో మోడీ (బిజెపి) ప్రభుత్వం అది అధికారం చేపట్టి తొమ్మిదేళ్లలో విభజన హామీలను విస్మరించింద న్నారు. అధికారంలోకి రాకముందు కొత్తగా ఏర్పాటయ్యే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 10 కాదు 15 యేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని, వెనుకబడిన ఏడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని, విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని, కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతా మని హామీలు ఇచ్చారన్నారు. వాటితోపాటు వైద్య విద్య ఉన్నత సంస్థలను ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మడానికి పూనుకున్నదన్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు కార్మిక సంఘాలు ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పరిశ్రమ పరిరక్షణ కమిటీ ఏర్పడి దాదాపు 800 రోజులుగా ఆం దోళన చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోని కేంద్ర పాలకులు ఏ ముఖం పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ కు వస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. విశాఖపట్నం బహిరంగ సభలో పాల్గొనడానికి వస్తున్న హోంశాఖ మంత్రి అమిత్‌షాకు బ్యాక్ (మా రాష్ట్రం నుంచి వెనక్కి వె ళ్ళిపో) నినాదంతో రాష్ట్ర వ్యా ప్తంగా నిరసన కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ఇటువంటి ఆందో ళనలు విభజన హామీలను అ మలు చేసేంతవరకు విశాఖ ఉ క్కు పరిశ్రమ ప్రైవేటు కాండను ఉపసంహరించుకునే ంతవరకు చేస్తూనే ఉంటామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి. నారాయణ, నగర కార్యదర్శి టి.రాముడు, సిపిఐనగర నాయకులు నాగరాజు, ఈశ్వర్, సిపిఎం నగర నాయకులు విజయ్,సాయిబాబా, సుధాకరప్ప, అబ్దుల్ దేశాయ్, శరీఫ్, యేసు, రమిజాబీ, కార్మిక,ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌ను పట్టించుకోని మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సుద్దవాగు నీరు అంతా కెసి కెనాల్‌లో కలిసి పారుతుండేదని, 23 వార్డు క్వార్టర్స్, ఆర్ అండ్ బి,ఠాగూర్ నగర్ నుండి వచ్చే మురుగు కాల్వలను యూటర్న్ చేసే యూటీ కాల్వకు కలపటం వల్ల శ్రీరామనగర్,లక్ష్మీనగర్ వీధులు జలమయం అవుతు న్నాయని సిపిఎం నాయకులన్నారు. ఆదివారం సిపిఎం జిల్లాకార్యదర్శి గౌస్ దేశాయ్, నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఎల్లాగౌడ్, శేషాద్రి సుద్దవాగు పరిశీలించారు. వారు మాట్లాడుతూ చిన్నపాటి వర్షా నికి రోడ్ల పై మురుగుతో వారాల తరబడి దోమల నిలయంగా మారుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. లక్ష్మీనగర్, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ కెసి కెనాల్ లింక్ రోడ్లు వేసింది లేదన్నారు. కృష్ణ నుండి హంద్రీనీవా కాల్వ తెచ్చినట్లు సముద్రం నీటిని సుద్దవాగు కు మరలించినట్లు కర్నూలు కార్పొరేషన్ వ్యహారం ఉందన్నారు. సుమారుగా వార్డు నుండి సంవత్సరానికి రూ.45 లక్షల నుండి రూ.60 లక్షల దాకా ఆస్తిపన్ను ద్వారా కార్పొరేషన్ కు ఆదాయం పోతుందన్నారు. చెత్తపన్ను, నీటి పన్ను తదితర పన్నులు చెల్లిస్తున్నా సరయిన మౌలిక వసతులు గ్రంథాలయం, కమ్యూనిటీ హాల్ ,ఆహ్లాదాన్ని ఇచ్చే పార్క్ ఒక్కటి కూడా లేదని వారన్నారు. వెంటనే వార్డు సమస్యల పరిష్కారం కోసం మేయర్, ఎమ్మెల్యే కార్పొరేటర్, కార్పొరేషన్ అధికారులు యుద్ధప్రాతి పదికన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సుద్దవాగు పరిశీలిస్తున్న సిపిఎం జిల్లాకార్యదర్శి గౌస్ దేశాయ్, నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఎల్లాగౌడ్, శేషాద్రి, తదితరులు

జొన్నగిరిలో రూ.50వేల వజ్రం లభ్యం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఒక రైతుకు వజ్రం లభ్యమైంది. ఆ వజ్రాన్ని జొన్నగిరి, అనంతపురం గుత్తికి చెందిన వ్యాపారులు రు. 50 వేలకు కొన్నట్లు తెలిసింది. ఇక్కడ దొరుకుతున్న వజ్రాల విలువ తెలియక దొరికిన వారు అత్యంత విలువైన వజ్రాలను తక్కువ రేట్లకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న వ్యాపారులు లక్షల విలువ చేసే వజ్రాలను కూడా కేవలం వేలకు మాత్రమే తీసుకుంటుంటారు. ఇప్పటికే తుగ్గలి మండలంలో గత పది రోజుల నుండి అత్యంత విలువైన వజ్రాలు లభిమయ్యాయి. వర్షం పడితే చాలు తుగ్గలి మండలం పరిధిలోని జొన్నగిరి, దేశాయి తండా, చిన్న జొన్నగిరి, పగిడిరాయి, ఉప్పర్లపల్లి, బొల్లవానిపల్లి, జి.ఎర్రగుడి, తుగ్గలి, చెన్నంపల్లి, చిన్న జొన్నగిరి తదితర గ్రామాలలో వజ్రాలు లభ్యమవుతుం టాయి. ఈ వజ్రాలను అనంతపురం జిల్లా గుత్తి, మద్దికేర మండలం పెరవలి, తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామాలకు చెందిన వజ్రాల వ్యాపారులు ఈ వజ్రాలను తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

- పాఠ్యపుస్తకాలు, జెవికె కిట్ల పంపిణీకి చర్యలు
- నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు కృషి
- ప్రజాశక్తితో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటావని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వెంకట రంగారెడ్డి అన్నారు. ప్రభుత్వ నిబ ంధనలు ప్రకారం ఫీజులను వసూలు చేయాల న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం నుండి బడు లు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు...

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?

డిఇఒ : జిల్లాలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలలో నాడు నేడు కింద పనులను చేపట్టి అక్కడ సౌకర్యాలను కల్పించాం. విద్యార్థులకు అవసరమయ్యే తరగతి గదులు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు, ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను కల్పించడం జరిగింది. ఇంకా అవసరమైన పాఠశాలలకు రెండో విడత కింద చేపడుతున్న నాడు నేడు పనుల్లో పూర్తిస్థాయి వసతులను కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత బలోపేతం చేయడం జరుగుతుంది.

పశ్చిమ ప్రాంతంలో అక్షరాస్యత శాతం తక్కువగా అనేక మండలాలు ఉన్నాయి? అక్కడ అక్షరాస్యత శాతం పెంపుకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

డిఇఒ : పశ్చిమ ప్రాంతంలో అనేక మండలాల్లో అక్షరాస్యత శాతం పెంపుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈ మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండేటట్లు చర్యలు చేపట్టాం. వీటితోపాటు ఈ ప్రాంతంలో ఉన్న పాఠశాలల్లో నాడు నేడు కింద అన్ని వసతులను కల్పించేందుకు పనులను కూడా చేపడుతున్నాం. ఈ ప్రాంతంలో ఉన్న బడి బయట ఉండే పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు ఈ ఏడాది ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించాం.

జిల్లాలో ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారు? ఫీజుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఇఒ : ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం నిబంధనలు ప్రకారం ఫీజులను వసూలు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులను వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై తగు తీసుకుంటాం.

జిల్లాలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉంచారా?

డిఇఒ : ఈ ఏడాది విద్యార్థులకు పాఠ్య పుస్తకాల కొరత లేకుండా ముందుగానే అన్ని పాఠశాలలకు చేర్చడం జరిగింది. ఇప్పటికే దాదాపుగా 70 శాతం పైగా పాఠ్య పుస్తకాలు వచ్చాయి. మిగిలిన పాఠ్యపుస్తకాలు కూడా త్వరలో రాగానే విద్యార్థులకు పంపిణీ చేస్తాం.

విద్యార్థులకు రాగిజావను ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారు?

డిఇఒ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పాఠశాలలు ప్రారంభమైన రోజు నుంచే రాగిజావను అందించనున్నాం. ఆ మేరకు జిల్లా వ్యాప్తంగా పంపిణీకి చర్యలు చేపట్టాం.

ఉచిత జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నిరుద్యోగ యువతి యువతకు మైపర్ ఫార్మసీ విద్య సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉచిత జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని విద్యా సంస్థ డైరెక్టర్ వైసిపి రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. మైపర్ సంస్థ, వర్చోబయోటెక్ కంపెనీ సహకారంతో ఉచిత జాబ్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. QA Executive/ QC Analyst/ Production Chemist/ Production Supervisor/ RA Specialist వంటి అంశాలపై Virchow BIOTECH PRIVATE LIMITED & MIPER సంస్థ 60 రోజుల పాటు ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు డాక్టర్ సతీష్ తెలిపారు. QC, QA, GMP, QMS, RA డిపార్టుమెంట్లలో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. B.Sc, M.Sc, B.Pharm/ M.Pharm/ B.Tech (Mech) కోర్సులు చదివిన వారు ఇందుకు అర్హులని వివరించారు. ఇందులో ఉద్యోగం పొందితే ఏడాదికి రూ.2.4 లక్షల గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు. కర్నూలు నగరంలోని మైపర్ కాలేజీలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆసక్తి గల నిరుద్యోగులు జూన్ 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రైనింగు అర్హత సాధించిన యువతీ యువతులకు ప్రతి ఒక్కరికి 100శాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 7330 666 762 సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ ఎంపిక పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు2435 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా2148 అంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.246 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష నిర్వాహనను పాఠశాల విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్ పర్యవేక్షించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

నేటి నుంచి ఒంటి పూటబడులు

కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో అన్ని పాఠశాలలు సోమవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో వారం రోజులపాటు ఒంటి ఫోటో బడులను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటల నుండి 11:30 గంటల వరకు పాఠశాలల తరగతులను నిర్వహించాలని పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు

ప్రజాశక్తి-సి బెళగల్

సిబెళగల్ లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు లైబ్రేరియన్ వెంకటరమణ, పరిషత్ సూపరిన్‌టెండెంట్ మంజుల ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. ఏటా వేసవిలో విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొని కబడ్డీ, క్యారంబోర్డు, పుస్తక పఠనం, క్విజ్, ఆటలు, పాటల పోటీలు సాహిత్యం, సామాజిక రంగాలపై అవగాహన వంటివి చేపట్టామని, సుమారు 30 విద్యార్థులు ప్రతిభ చాటినట్లు లైబ్రేరియన్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శిబేగ్, సిబ్బంది లక్ష్మణ్ పాల్గొన్నారు.

పండిట్‌లు, పిడిలను రిలీవ్ చేయాలి : ఎపిటిఎఫ్

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న హృదయరాజు, తదితరులు

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

2023 బదిలీల్లో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీపై వెళ్లిన హిందీ, తెలుగు ఫిజికల్ డైరెక్టర్లను సబ్‌స్ట్యూట్ తో నిమిత్తం లేకుండా రిలీవ్ చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి హృదయరాజు జిల్లా అధ్యక్షులు, ఎస్. ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిల విషయంలో ఇద్దరు ఉన్నచోట ఒకరిని, నలుగురు ఉన్నచోట ఇద్దరిని ఇలా కనీసం 50శాతం మంది టీచర్లను రిలీవ్ చేయాలని ఉత్తర్వులు 47 నిబంధన 15 లో ఉన్నదన్నారు. తెలుగు , హిందీ ,ఫిజికల్ డైరెక్టర్ల విషయంలో ఖాళీలను బ్లాక్ చేయడంతో ఉన్న పాఠశాలలను వెబ్ ఆప్షన్స్ ద్వారా ఎన్నుకున్నారన్నారు. వీరికి కూడా సబ్‌స్ట్యూట్ ఉంటేనే రిలీవ్ చేస్తామని ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు కట్టడి చేస్తున్నారన్నారు. ఈ సబ్జెక్టులలో పదోన్నతుల పోస్టులు భర్తీ కాకపోవడం, కోర్టులో కేసు పెండింగ్ ఉండడంతో సబ్‌స్ట్యూట్ ఉండారన్నారు. వారందరిని రిలీవ్ చేయాలని కోరారు.

శారీరక మానసిక దృఢత్వానికి తైక్వాండో

సమ్మర్ కోచింగ్ క్యాంపు ముగింపులో కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డిఎస్‌పి మహబూబ్‌బాషా

శారీరక మానసిక దఢత్వానికి ఆత్మస్థైర్యానికి టైక్వాండో ఎంతో ఉపయోగపడుతుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ప్రజాశక్తి కార్యాలయం ఎదురుగా ఉన్న సుందరయ్య పార్క్ ఆవరణలో తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపులు సంతోష్‌నగర్ ఇన్‌ఛార్జి లలితకీర్తన, ఎపి మోడల్ స్కూలు పెద్దపాడు ఇన్‌ఛార్జి రోహిత్, ప్రజాశక్తి ఎడిషన్ కేంద్రం ఇన్‌ఛార్జి జి షబ్బీర్ హుస్సేన్ నిర్వహిస్తున్న క్యాంపుల ముగింపు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే కాటసాని రాంభూపల్‌రెడ్డి, స్పెషల్‌బ్రాంచి డిఎస్‌పి ఎస్.మహబూబ్‌బాష, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా అందజేశారు. సుందరయ్య పార్కు అవరణలో సీనియర్ జర్నలిస్టు ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌ఛార్జి పి.చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సభలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ శారీరక శ్రమ చక్కటి ఆరోగ్యాన్ని, మనం ఎంచుకునే లక్ష్యం పట్ల ఆసక్తిని పెంచుతుందని అన్నారు. శ్రద్ధతో సాధన చేస్తే ఏదైనా సాధించవ్చని సూచించారు. తైక్వాండో అభివృద్ధికి ఎమ్మెల్యేగా తోడ్పాటునందిస్తామని హామీ ఇచ్చారు. ఓర్వకల్లు పరిశ్రమలలో ఉద్యోగాలు ఇప్పించడానికి క్రీడాకారులకు ఎంత సహకరిస్తామో అంత చేస్తామన్నారు. శారీరకంగా ధృడంగా ఉంటేనే చదువు కోగలుగుతారన్నారు. ప్రజాశక్తి కార్యాలయం ఎదురుగా ఉన్న సుందరయ్య పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉంటే ఎవరైనా కబ్జా చేసే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడ కబ్జా చేసినా తానే చేసినట్లు పత్రికలు రాస్తున్నాయన్నారు. అలాంటివి రాకుండా పార్కును అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ప్రతిఒక్కరు తల్లిదండ్రులను, గురువులను గౌరవించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని చెప్పారు. స్పెషల్ బ్రాంచి డిఎస్‌పి ఎస్.మహబూబ్ బాష మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు పిల్లలకు ఇతర అలవాట్లకు వెళ్లకుండా ఆటల పట్ల ఆసక్తి పెరిగేలా పని చేస్తాయన్నారు. అలాంటి కషి చేసిన తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్‌ను అభినందించారు. ఆల్‌ఇండియా యూనివర్సిటీ వాలీబాల్ పోటీలలో ఎస్‌వి యూనివర్సిటీ నుంచి ఆడానని, ఆ ఫిట్‌నెస్ ఎస్‌ఐ సెలక్షన్‌కు ఉపయోగపడిందన్నారు. మా పిల్లలను కూడా క్రీడలపట్ల ఆసక్తి పెంచేలా చేశాయన్నారు. క్రీడల సాధన భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని సూచించారు. కాబట్టి క్రీడలను ప్రోత్సహించాలని తలిదండ్రులను, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కోరారు. తనవంతు కూడా సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ తైక్వాండో కోచ్ కపిల్, సల్మాన్, తల్లిదండ్రులు పాల్గన్నారు. అంతకు ముందు తైక్వాండో డెమో విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ప్యాడ్ వర్క్, ట్రిక్స్ బ్రేకింగ్‌లో చక్కటి ప్రదర్శన ఇచ్చారు. అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే, డిఎస్‌పి ప్రదానం చేశారు.

క్రీడాకారులకు బ్యాగులు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

ఆత్మరక్షణకు ఆయుధం మార్షల్ ఆర్ట్స్

ఉషూ జిల్లా సంఘం చైర్మన్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉషూ క్రీడా శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉషూ జిల్లా సంఘం చైర్మన్ డాక్టర్ శంకర్‌శర్మ పాల్గొని మాట్లాడారు. చిన్నారులు 40 రోజులపాటు ఉషూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం చాలా సంతోషదాయకం అన్నారు. మార్షల్ ఆర్ట్స్ వలన సాహసం, ఉత్సాహం, ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. చదువుతోపాటు ప్రాథమిక దశ నుండే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన క్రీడల్లో సాధన చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఇంతటితో ఆపకుండా రోజూ సాధన చేయాలని అన్నారు. అనంతరం డాక్టర్ శంకర్ శర్మ విద్యార్థులకు బ్యాగులు, ఫలహారాలు అందజేశారు. సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారని, పలురకాల ఉషూ విన్యాసాలు చేశారని, ఉషూ మాస్టర్స్ సుధాకర్, అముతేశ్వర్, శ్రీనివాసులు, చిరంజీవులు, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బస్సులు నడపాలి : సిఐ

ప్రజాశక్తి-తుగ్గలి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్సులు నడపాలని పత్తికొండ రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఎస్‌పి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు తుగ్గలి పోలీస్టేషన్ ప్రైవేట్ యాజమాన్యాలకు, బస్సు డ్రైవర్లకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ప్రవేట్ యాజమాన్యాలు బస్సులో సీటు కెపాసిటీకి తగ్గ విద్యార్థులు మాత్రమే ఎక్కించుకోవాలన్నారు. బస్సుకు సంబంధించిన అన్ని పర్మిట్లను డ్రైవర్ల దగ్గర అందుబాటులో ఉండాలన్నారు. నిబంధనల మేరకు లేకపోతే సీజ్ చేస్తామన్నారు. ఇష్టానుసారంగా బస్సులు నడిపితే అటు యాజమాన్యం, ఇటు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున , వివిధ పాఠశాలల యాజమాన్యం బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

సేవా గుణానికి కేరాఫ్ శ్రీరామ్

- 33 సార్లు రక్తదానం చేసిన ఆదోని వాసి

ప్రజాశక్తి - ఆదోని

కొందరు రక్తదానం అనగానే ఏదో కారణం చెప్పి తప్పించుకుంటారు. కానీ ఆదోని వాసి శ్రీరామ్ మాత్రం రక్తం అవసరం అని తెలియగానే వాలిపోతాడు. అందుకే అతను ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 33 సార్లు రక్తదానం చేశాడు. ఇటీవల తమిళనాడు రాష్ట్రంలోని వెలురు పట్టణం సీఎంసీ రాణి పేట్ క్యాన్సర్ ఆసుపత్రిలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణానికి చెందిన బసవన్నగౌడ్‌కు కిడ్నీ క్యాన్సర్ వల్ల అత్యవసరంగా ఏ-పాజిటివ్ రక్తం అవసరమైతే ఆదోని జనసేవా సామజిక సేవా సంస్థ కార్యదర్శి విరుపాక్షి స్వామికి సమాచారం అందించగా.. రక్తదాత శ్రీరామ్‌కు ఫోన్ చేయగానే వెంటనే స్పదించి వెలురుకు వెళ్లి రక్తదానం చేశారు. స్వచ్చదంగా 33వ సారి రక్తదానం చేసి శ్రీరామ్ సేవా గుణాన్ని చాటుకున్నాడు. రక్తదానం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, యువత అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రక్తదాత శ్రీరామ్ సూచించారు. ఈ కార్యక్రమంలో నందవరం మల్లికార్జున గౌడ్, విరుపాక్షి స్వామి పాల్గొన్నారు.

రక్త దానం చేసిన శ్రీరామ్

సమావేశంలో మాట్లాడిన వీరేష్

ఉచిత సిటీ స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత సీటీ స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, మాజీ డివిజన్ కార్యదర్శి లక్ష్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ కార్యాలయంలో వెంకటేశులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, స్త్రీల చిన్నపిల్ల ఆసుపత్రుల్లో అన్ని రకాల జబ్బులకు మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిటీ స్కానింగ్ లేకపోవడంతో పేద ప్రజలు ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ స్త్రీల చిన్న పిల్లల ఆసుపత్రిలో గర్భిణులకు చేస్తున్న స్కానింగ్ ఒక్కటే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వారంలో రెండు మార్లు గర్భిణీ మహిళలకు స్కానింగ్ చేయాలన్నారు. రోగులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాల్లో యువకులు పాల్గొన్నాలని సూచించారు. ఈ సమావేశంలో సతీష్, వీరేష్, మోహన్, ముని, వినోద్, రంగ, జమీర్, రాము, రాజు, విజయ్ పాల్గొన్నారు.

ముగిసిన ఎపి మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. ఆరవ తరగతిలో మొత్తం 80 సీట్లకు గాను 308 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 297 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయిన్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో రాణించి ఆరవ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు పదవ తరగతితో పాటు ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే విద్యను కొనసాగించే వీలుంటుంది.

జూనియర్ కాలేజీలో డిగ్రీ తరగతులు నిర్వహించొద్దు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తాత్కాలిక తరగతులు నిర్వహించొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం ఆయన ఆదోనిలో విలేకరుల తో మాట్లాడుతూ ఇంటర్ బాలికలు మధ్యాహ్నం వరకు మాత్రమే చదువు కోవటం వలన నాణ్యమైన విద్య అందడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. సొంత భవనం లేకుండా, సమయపాలన లేకుండా తూతూ మంత్రంగా డిగ్రీ కళాశాల ప్రారంభమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నత స్థాయి విద్యా అధికారులు పునరాలోచించి డిగ్రీ కళాశాలను ప్రత్యేకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కట్టుకున్నోడే కాలయముడై..

- పెళ్లి అయిన నెలలోపే

అత్తను ,భార్యను చంపిన అల్లుడు

ప్రజాశక్తి- కౌతాళం

వివాహమైన నెల రోజుల్లోనే పచ్చని కాపురంలో కలకలం ఏర్పడింది. సజావుగా సాగాల్సిన సంసారంలో భార్య భర్తల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. కాపురం తమ తమ ఊరిలో ఉండాలని భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవ ఇద్దరి హత్యకు దారితీసింది. ఈ ఘటన కర్నూలు జిల్లా కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలోని బాపురం గ్రామంలో వెలుగు చూసింది. ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...బాపురం గ్రామానికి చెందిన బోయ తలారి హనుమంతమ్మ (45)బాపురం తలారిగా పనిచేస్తు న్నారు. ఆమెకు ఒక కూతురు మహాదేవి (25) బాపురం గ్రామంలో వాలంటీర్ గా విధులు నిర్వహిస్తున్నారు. మహాదేవికి ఐదేళ్లక్రితం ఈర్ల దిన్నె గ్రామానికి చెందిన దస్తగిరితో వివాహమయింది. వ్యక్తి గత కారణాలతో విడిపోయారు. మహాదేవి రెండవ వివాహం కర్ణాటక రాష్ట్రం తెక్కలకోటకు చెందిన బోయ రమేష్‌తో గత నెల రోజుల క్రితం హచ్చోలి మఠంలో పెద్దలు సమక్షంలో వివాహం చేశారు. పెళ్లి అయ్యాక తెక్కల కోటలో కాపురం ఉండాలని రమేష్, మహాదేవి గ్రామ వాలంటీర్ అయినందున బాపురంలోనే కాపురం ఉండాలనే విషయంలో ఈ నెల 9న రాత్రి గొడవ పడ్డారు. బంధువులు సర్దిచెప్పారు. శనివారం రాత్రి రమేషన్ అత్త హనుమంతమ్మతో, భార్య మహాదేవితో గొడవ పడి ఇద్దరిని బలమైన ఆయుధంతో తలపై మోది హత్య చేశాడు. ఈ విషయం ఎవరికీ అనుమానం రాకుండా ఇంటికి బయట తాళం వేసి పారిపోయాడు. ఆదివారం ఉదయం హనుమంతమ్మ అన్న అయ్యప్ప బంధువులు ఫోన్ చేస్తే సెల్ ఫోన్స్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వారు అనుమానంతో హనుమంతమ్మ ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండటం గమనించారు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండడంతో ఇంటి కిటికీలోంచి చూశారు. తల్లీబిడ్డలు నేల మీద పడి ఉండటం చూసి తాళం పగలగొట్టి చూశారు. హనుమంతమ్మ , మహాదేవి తలలకు తీవ్ర రక్త గాయాలతో చనిపోయినట్లు గుర్తించారు. ముద్దాయి రమేష్ మీద హనుమంతమ్మ అన్న అయ్యప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ముద్దాయిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు.

మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - దేవనకొండ

భర్త, అత్తమామల వేధింపులతో వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన దేవనకొండ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల వివరాల మేరకు ఇలా ఉన్నాయి. ఆదోని పట్టణానికి చెందిన చాకలి శశికళ(26)కు 8 సంవత్సరాల క్రితం మండల కేంద్రమైన దేవనకొండ గ్రామానికి చెందిన చాకలి గోపాల్ కుమారుడు చాకలి నరేష్‌తో వివాహం జరిగింది. రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబ సభ్యులు శశికళను గత కొన్ని నెలల క్రితం ఆదోనికి తీసుకెళ్లారు. అయితే గత పది రోజుల క్రితం చిన్న మామ నరసింహులు ఇంటిలో జరిగే వివాహం వేడుకలకు శశికళను పిలుసుకొచ్చారు. భార్య భర్తల మధ్య ఘర్షణ తలెత్తి మనోవేదనకు గురై ఆదివారం ఇంట్లో ఉరి వేసుకొని శశికళ ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు కలరు. పిల్లల పేరు మీద ఆస్తి రాసి ఇవ్వాలని మూడు గంటలపాటు మృతురాలి కుటుంబ సభ్యులు ఇంటి ముందర ఆందోళన నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించకుండా అడ్డుకున్నారు. అయితే ఆస్తి రాసి ఇస్తామని చెప్పడంతో మృతదేహాన్ని పత్తికొండకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భర్త, అత్తమామలే మా అమ్మాయిని వేధింపులకు గురిచేసి చంపారని మృతురాలి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృతిచెందిన శశికళ

హడావుడితో.. విద్యా కానుక

- అసంపూర్ణంగా నాడు- నేడు పనులు - అరకొర వసతులతో ఉన్న పాఠశాలలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వేసవి సెలవులు ముగించుకొని నేడు పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేయడానికి అధికారులు హడావుడి చేస్తున్నారు. గతంలో షూస్ సరైన సైజులు అందక విద్యార్థులు మూడునాళ్ళ ముచ్చటగా వదిలేశారు. ఈసారైనా సరైన షూస్ సైజులు దొరుకుతాయా? లేదా! ఆలోచనలో ఉన్నారు విద్యార్థులు. మొదటి విడత నాడు- నేడు పనులు జరిగిన పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు ఒక్కటి కూడా పనిచేయకపోవడం, అరకొర ఉపాధ్యాయులతో పాఠశాలలు ప్రారంభం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా నిపుణులు పేర్కొంటున్నారు.

అన్ని పాఠశాలలకు జెవికె కిట్లను అందజేస్తున్నాం

ఈ విద్యా సంవత్సరం గాను సోగానూరు రోడ్‌లో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేసి అక్కడినుండి అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్నాము. అదేవిధంగా బాలికలకు 12196 షూస్, బాలురకు11430 షూస్‌లు, 23640 బ్యాగులు, 2077 విక్టరీ డిక్షనరీలు, 2560 ఆక్స్ఫర్డ్ డిక్షనరీలు, 168222 టెస్ట్ పుస్తకములు ఉన్నాయని వీటిని ప్రతి పాఠశాలకు పంపించాము.

- ఎంఈఓ ఆంజనేయులు

టిడిపి నేతకు కార్యకర్తలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డు ప్రమాదంలో గాయపడిన టిడిపి నాయకుడి కుటుంబానికి ఆ పార్టీ కార్యకర్తలు నుండి సేకరించిన మొత్తం రూ. 50 వేలను బాధితుడికి ఆదోని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడు ఆదివారం అందజేశారు. మూడు నెలల క్రితం మోటార్ సైకిల్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇబ్బంది పడుతున్న జాలమంచి గ్రామంకు చెందిన తెలుగుదేశం పార్టీ సభ్యుడు చిదానందను మీనాక్షి నాయుడు మాట్లాడుతూ పరామర్శి ంచామన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడుతూ చిదానంద ఆరోగ్య పరిస్థితి గమనించి నాయకులు, కార్యకర్తలు తరుపున ఆర్థిక సహాయం చేశామన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అదేవిధంగా కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన అదే గ్రామానికి చెందిన చాకలి తిక్కన్నకుమారుడు వివాహానికి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి వారిని పరామర్శించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుద్ధారెడ్డి, శివప్ప, బంగారయ్య, లక్ష్మీ నారాయణ, జయరామ్, అయ్యన్న, తిమ్మప్ప, రవి, గోవిందు, హుసేని, షణ్ముఖ, బాలస్వామి, రామంజిని పాల్గొన్నారు.

సేకరించిన మొత్తాన్ని బాధితునికి అందజేసిన మీనాక్షి నాయుడు

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రత్యక్ష పోరుబాటకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కె అజయ్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే లక్ష్మిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు టి వీరేష్, బసాపురం గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మండల సహాయ కార్యదర్శి బి నర్సప్ప అధ్యక్షతన జరిగిన మండల సమితి ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోని పట్టణ సమగ్రాభివృద్ధికి మూత బడిన పరిశ్రమలు తెరిపించాలని, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేవనకొండ మండలంలో హంద్రీనీవా ప్రధాన కాలువల ద్వారా చెరువులకు నీరు నింపాలని, ఆయకట్టు స్థిరీకరణ పనులు, పిల్ల కాలువల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కోడుమూరు నియోజకవర్గంలో గూడ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలని, పత్తికొండ నియోజక వర్గంలో హంద్రీనీవా ప్రధాన కాలువల ద్వారా గ్రామాల్లో ఉన్న చెరువులను నింపాలన్నారు. పిల్ల కాలువలు నిర్మించాలని, వేదవతి ప్రాజెక్టు నిర్మాణం ఎనిమిది టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల సమితి సభ్యుల సమక్షంలో సిపిఐ ఆదోని మండల కార్యదర్శిగా కల్లుబావి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ సుదర్శన్, రైతు సంఘం మండల అధ్యక్షులు మదిరి ఎల్లప్ప, కొత్తూరు గ్రామ మాజీ సర్పంచ్ హనుమంతు గంగన్న, ఈరన్న గౌడ్, భీమప్ప, చిన్న నరసప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడిన గిడ్డయ్య

చివరి దశకు నాడు నేడు పనులు

- నాడు నేడు ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఎఇ

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో నాడు నేడు పథకము కింద పాఠశాలలో మంజూరైన నిర్మాణ పనులన్నీ చివరి దశకు వచ్చాయని నాడు నేడు ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామ్ నీలా తెలిపారు. ఆదివారం నాడు నేడు పథకము ద్వారా ఆయా గ్రామాలలో చిప్పగిరి, నేమకల్లు, రామదుర్గం పాఠశాలలో చివరి దశలో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు పథకము ద్వారా కొన్ని పాఠశాలలో మరమ్మతు పనులు, బాత్రూంల, టాయిలెట్లు, అదనపు గదులు పూర్తి అయ్యాయని, కొన్ని పనులు మాత్రమే ఒక వారం లోపల పూర్తవుతాయన్నారు. పాఠశా లలు తెరుస్తున్నందున విద్యార్థిని విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బాత్రూంల, టాయిలెట్లకు నీటి వసతికి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పెండిం గ్‌లో ఉన్నా నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టు ధరలకు ఆదేశాలు ఇచ్చామ న్నారు. నాడు నేడు నిధులలో ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు అవుతున్నాయ న్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాడు నేడు ప్రత్యేక అధికారి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామ్ నీలా

మేధోసంపత్తిని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - చిప్పగిరి

విద్యార్థినీ విద్యార్థులలో మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు గ్రంథాలయ అధికారి సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన చిప్పగిరి గ్రంథాలయ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాలతో వేసవి సెలవుల్లో విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా 6, 7, 8 విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర వాటిలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు చివరి రోజున గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో మంచి నైపుణ్యత కలిగి ఉందని అలాగే భవిష్యత్తులో కూడా వారికి అనుగుణంగా అవగాహన కల్పించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు.

పరుగు పందెం విజేతగా తలారి బ్రదర్స్

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని దుద్ది గ్రామంలో నిర్వహించిన పరుగు పందెం పోటీల్లో తలారి బ్రదర్స్ అయినటువంటి తలారి చిన్నముకయ్య, తలారి రామకృష్ణలు ముందంజలో ఉన్నారు. ఆదివారం గ్రామంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత సంవత్సరం సైతం పరుగు పందెం పోటీల్లో తలారి చిన్న మూకయ్య మొదటి స్థానం కైవసం చేసుకున్నాడు. రెండు సంవత్సరాలు వరుసగా చిన్న మూకయ్య పరుగు పందెం పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకోవడంతో గ్రామ ప్రజలు ఆ యువకుల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఏరువాక పౌర్ణమి వేడుకలు గ్రామ ప్రజలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. పరుగు పందెం పోటీల్లో మొదటి స్థానం, ద్వితీయ స్థానం, తతీయ స్థానం చేసుకున్న యువకులకు గ్రామ పెద్దలు శివరెడ్డి, సోమప్ప, లక్ష్మణులు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజారెడ్డి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మండల ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, సభ్యులు సతీష్, మహ్మద్, గ్రామస్తులు మల్లేష్, రమేష్, హనుమంతు, తలారి చిన్న ఈరన్న, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అధిక ధరలకు ఎరువులను, విత్తనాలను విక్రయిస్తున దుకాణాలను సీజ్ చేయాలని సిపిఐ ఎమ్మిగనూరు పట్టణ సమితి ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ నందు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ మేరకు అధిక ధరల రక్కసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలవ గానే ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న విత్తన, ఎరువుల యజమానులకు సంబరాలు మొదలవుతాయని అమాయక రైతులను ఆసరుగా చేసుకుని వాళ్లకి కావలసిన విత్తనాలను,ఎరువులను అధిక ధరలు విక్రయిస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని వారు తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న విత్తన దుకాణాలకు మంత్రాలయం, రాయచూరు, తెలంగాణ జిల్లాల నుండి వచ్చి కొనుగోలు చేయడం జరుగుతుందని వచ్చిన రైతులను మాయ మాటలు చెప్పి అధిక రేట్లకు విక్రయిస్తున్నారని వారు పేర్కొన్నారు. పత్తి విత్తనాలు యస్ 7067 రకంతో పాటు మరికొన్ని రకాలకు మంచి డిమాండ్ ఉందనీ, ఒక ప్యాకెట్ ధర 850 రూపాయలు ఎంఆర్‌పి ధర ఉండగా, దానిని కొంతమంది దుకాణ యజమానులు కృత్రిమ కొరతను సృష్టించి రూ. 1200 నుండి రూ. 1500 వరకు విక్రయిస్తున్నారని అన్నారు. ఒక పత్తి ప్యాకెట్‌పై రూ.400 నుండి రూ.700 వరకు అధిక రేట్లు అమ్ముతున్నారని అన్నారు. సింజెంటా 2043 రకం మిరప విత్తనాలు ప్యాకెట్ రూ. 950 ఉండగా దానిని రూ .1800 విక్రయిస్తున్నారని, మిరప పాకెట్‌పై రూ. 900 అధనంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతులకు బిల్లులో మాత్రం ఎమ్మార్పీ ధరనే నమోదు చేస్తున్నారని ఒకవేళ రైతు ప్రశ్నిస్తే విత్తనాలు కావాలా వద్దా అని చెప్పి బెదిరిస్తున్నారని అన్నారు. ఈ దోపిడీ అరికట్టాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా దుకాణాలపై తనిఖీల పేరుతో హడావుడి చేసి హంగామా సృష్టిస్తున్నారే తప్ప ఎక్కడ కూడా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు నిజాయితీతో రైతుల పక్షాన నిలవాలంటే అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలను సీజ్ చేయాలని అన్నారు. లేనిపక్షంలో సిపిఐ ప్రత్యక్ష పోరాటానికి పూనుకుంటుందని ఈ సందర్భంగా వ్యవసా య శాఖ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి బాలరాజు, సమివుల్లా, సిపిఐ మండల కార్యదర్శి బి.టి.చిన్నన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్తన్న, పార్టీ ప్రజాసంఘాల నాయకులు బజారి దాదావళి, కేసీ జబ్బర్, హనుమంతు,తిమ్మ గురుడు, కాజా,మాలిక్, మల్లికార్జున గౌడ్,వీరేష్, నరసింహ,అంజని, రమేష్,శ్రీను ఇస్మాయిల్, షరీఫ్, రవి,ఎల్లప్ప,అల్లా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆలూరు

ప్రయివేట్ విద్యా సంస్థల ఫిట్ నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీ నారాయణ, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచుకునేందుకు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నా యన్నారు. నాణ్యమైన విద్య నందిస్తున్నామని ప్రకటనలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయన్నారు. ఆలూరు మండలంలో వివిధ ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి స్కూలు బస్సులను ఆలూరు పోలీస్ స్టేషన్లో తనిఖీలు చేసినట్లు తెలిసిందన్నారు. ఈ తనిఖీలు అంతా తూతూ మంత్రంగా జరిగిందన్నారు. ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ సేయింట్ జాన్స్ స్కూల్ యాజమాన్యం బస్సులో విద్యార్థులను పరిమితికి మించి గ్రామాల నుండి తీసుకురావడం జరుగుతుందని, సాయి శ్రీ ప్రవేట్ స్కూల్ విద్యార్థులను బస్సుల్లో కాకుండా టాటా ఏసి ఆటోలో వివిధ గ్రామాల నుంచి విద్యార్థులను తరలిస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లి దండ్రులతో కలిసి రహదారులు దిగ్బందిస్తామని హెచ్చరించారు.

తుంగభద్ర నదిపై వరద కాల్వను నిర్మించాలి

మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ తిక్కారెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిపై వరద కాల్వను నిర్మించాలని మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ తిక్కారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మెలిగనూరు గ్రామం వద్ద తుంగభద్ర నదిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వరద కాల్వ నిర్మించడం ద్వారా వచ్చిన నీటిని నిల్వ చేస్తే సుమారు 5 నుంచి 10 టీఎంసీ నీటిని ఉపయోగించుకోవచ్చని అన్నారు. మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలు సస్యాస్యామలం అవుతాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే వరద కాల్వను నిర్మించి పశ్చిమ ప్రాంతాన్ని సస్యాస్యామలం చేస్తామన్నారు. ఎగువన వేదావతి ప్రాజెక్టు నిర్మించి వరద నీరు, వేదావతి నీటిని అనుసంధానం చేసి,పచ్చని భూములుగా మార్చి రెండు పంటలకు సాగునీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప డేని, తెలుగు రైతు జిల్లా ప్రదాన కార్యదర్శి వెంకటపతి రాజు, జిల్లా కార్యదర్శి కోట్రేష్ గౌడ్, రమేష్ గౌడ్, వెంకటరెడ్డి, బిసి సెల్ జిల్లా కార్యదర్శి కురుగోడు, టి యన్ యస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివమూర్తి, యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి రాజాబాబు, శివప్పగౌడ్ కావలి ఈరప్ప, ఓబులాపురం నరసింహులు, ఐ టిడిపి అధ్యక్షులు సల్మాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నదిని పరిశీలిస్తున్న టిడిపి బృందం

స్వాగతం పలుకుతున్న యుటిఎఫ్ నాయకులు

86 మంది ఉపాధ్యాయుల బదిలీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలం నుంచి 86 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలు పదోన్నతుల్లో భాగంగా 46 మంది ఎస్జిటి నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొంది ఇతర పాఠశాలలకు వెళ్ళగా ఒకే చోట 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 40మంది ఉపాధ్యాయులు కూడా బదిలీపై వెళ్లారు. ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారు ఆదివారం రిలీవ్ కాగా వీరి స్థానంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నూతన ఉపాధ్యాయులు గోనెగండ్లలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు సమర్పించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఏపీ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

దళితులపై దాడులను అరికట్టాలి : డిహెచ్‌పిఎస్

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ఎస్‌సి ఎస్‌టిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సి. మహేష్ అన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయం నందు దళిత హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం ఓంకార స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. మహేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం తాలూకా అధ్యక్షులు ఎం.గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చి 9సంవత్సరాల అవుతున్న దళితులు ఏమాత్రం బాగా పడలేదని వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల పట్ల కపట ప్రేమ చూపిస్తుందని, దళితుల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు బడ్జెట్‌లో కేటాయించిన ఆ నిధులు దళితుల అభ్యున్నతికి ఖర్చు చేయకుండా ఇతర వాటికి అనగా నవరత్నాలకు, ఇతర సంక్షేమ పథకాలకు మళ్లింపు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రచ్చుమర్రి గ్రామంలో దళితుల పైన జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి దాడులు మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని వారు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, నాగరాజు, ఉలిగయ్యా, తిక్కయా, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు విద్యా కానుక కిట్లు తరలింపు

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలో ఆదర్శ పాఠశాలల నుండి మండలలోని అన్ని పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను ఎంఈఓ సువర్ణల సునీయం ఆధ్వర్యంలో ఆదివారం తరలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పెద్ద కడబూరు మండలంలోని ప్రాథమిక ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు మోడల్ స్కూల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చెందిన మొత్తం 10825 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లను ఆయా పాఠశాలలకు చేరవేయడం జరుగుతుందన్నారు. సోమవారం పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు.

బడికి వేళాయె..!

- నేటి నుంచి పాఠశాలలు పున: ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల తిష్ట

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వేసవి సెలవుల విరామం అనంతరం తిరిగి బడికి వేళైంది. సోమవారం నుంచి పాఠశాలలు పునర్‌ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేయగా ప్రయివేటు పాఠశాలలు ఫీజుల దోపిడీతో భయపెడుతున్నాయి...

50 రోజుల తర్వాత మళ్లీ బడిగంట మోగనుంది. ఇన్నాళ్లు ఆటపాటలతో గడిపిన పిల్లలు మంగళవారం నుంచి స్కూళ్ల బాట పట్టనున్నారు. నిశ్శబ్దం ఆవహించిన పాఠశాలలు ప్రార్థన గీతాలతో సందడిగా మారనున్నాయి. నూతన విద్యా సంవత్సరం మంగళవారం ప్రారంభం కానుండగా, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. పాఠశాల విద్యారంగంలో అనేక మార్పులను ప్రభుత్వం చేపడుతున్నా మౌలిక సదుపాయాల కల్పనలో ఏటా లోటు కనిపిస్తూనే ఉంది. ఒకవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హంగు, ఆర్భాటాలతో విస్తత ప్రచారం చేస్తూ ప్రవేశాల సంఖ్య పెంచుకుంటుండగా, సర్కారు బడుల్లో సమస్యలు వెన్నాడుతూనే ఉన్నాయి. నాడు-నేడు పనులతో స్కూళ్లను అందంగా తీర్చిదిద్దుతున్నామని, నాణ్యమైన విద్యావిధానం అందచేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నా ఆచరణలో మేడిపండు చందంగా మారుతోంది. నంద్యాల జిల్లాలో 408 ప్రాథమిక, 178 ప్రాథమికోన్నత, 168 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. నాడు-నేడు పనులు చేపడుతున్నామని, త్వరలోనే వీటిని పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో వేసవిలో చేపట్టాల్సిన పనులు నిర్వహించలేదు. ఫలితంగా పాఠశాలల్లో మంచినీటి సమస్య వెంటాడుతూనే ఉండగా, మరుగుదొడ్లు ఆశించినస్థాయిలో లేవు. ఇక పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. తగినన్ని తరగతి గదులు లేని పాఠశాలలు కొన్ని ఉండగా నిధుల లేమి కారణంగా పలు పాఠశాలల్లో శిథిల దశకు చేరుకున్నా మరమ్మతులు చేయలేదు.

పాఠశాలల వేళల్లో మార్పు

- నేడు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వేడి గాలులు, ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాలల వేళల్లో మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎండలు తీవ్రంగా ఉన్నాయి కాబట్టి పాఠశాలలకు సెలవులు పొడిగించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పాఠశాలల పని వేళల్లో మార్పు చేసింది. వేడి గాలులు తగ్గని కారణంగా పాఠశాలల నిర్వహణను ఈ నెల 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఉదయం 7-30 గంటల నుండి 11-30 గంటల వరకు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల వేళల్లో మార్పు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు రాగి జావ ఉదయం 8-30 నుండి 9 గంటల మధ్యలో, భోజనం 11-30 గంటల నుండి 12 గంటల మధ్యలో పెట్టాలని పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభం రోజుననే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు నేడు అందించబోతున్నారు.

డోన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- ఆర్‌అండ్‌బి అతిథి గృహం ప్రారంభం

ప్రజాశక్తి - డోన్

డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే తన ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలో రూ.3 కోట్లతో అధునాతన హంగులతో నిర్మించిన ఆర్‌అండ్‌బి అతిథి గృహాన్ని రాష్ట్ర రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, డిఐజి సెంథిల్ కుమార్, నంద్యాల, కర్నూలు జిల్లాల కలెక్టర్లు మనజీర్ జిలానీ సామూన్, సృజన, ఎస్‌పిలు రఘువీర్ రెడ్డి, జి.కృష్ణకాంత్, జడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలతో కలిసి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో ప్రజల రుణం తీర్చుకునేలా అభివృద్ధి ఫలాలు అందించామని చెప్పారు. విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సౌకర్యాలకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు, ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌ఎండి జాకీర్ హుస్సేన్, కమలాపురం సర్పంచి రేగటి అర్జున్ రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ టిఇ.దినేష్ గౌడ్, సీనియర్ న్యాయవాది ఎం.నాగభూషణ్ రెడ్డి, భాస్కర్ నాయుడు, మధుసూదన్ రెడ్డి, కృష్ణమూర్తి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

అర్బన్ హెల్త్ సెంటర్లలో
త్వరలో అల్ట్రాసౌండ్ సేవలు

- ప్రతి నెలా 9న గర్భిణులకు హెల్త్ చెకప్
- ప్రజాశక్తితో నంద్యాల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ముఖాముఖి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో వైద్య సేవల మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా అర్బన్ హెల్త్ సెంటర్లలో అల్ట్రాసౌండ్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. గతంలో అల్ట్రాసౌండ్, టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వంటి పరీక్షలు చేయించుకోవాలంటే జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండానే దాదాపు 20 రకాల పరీక్షలు అర్బన్ హెల్త్ సెంటర్‌లలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం. పేదవాడికి అర్బన్ హెల్త్ సెంటర్‌లు వరం లాంటివి' అని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి తెలిపారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆయన ప్రజాశక్తితో ముఖాముఖీ మాట్లాడారు.

నంద్యాల పట్టణంలో ఏ ఏ ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేశారు..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : ముఖ్యంగా అర్బన్ హెల్త్ సెంటర్‌లు స్లమ్ ఏరియాలలో ఏర్పాటు చేశాం. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ఆరోగ్య కేంద్రాలు నిర్వహిస్తున్నాం. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వైద్యులు అందుబాటులో ఉంటారు.

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 8 అర్బన్ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. 5 కొత్త భవనాలు ఉన్నాయి మూడు బిల్డింగ్‌లకు నాడు-నేడు కింద మరమ్మతులు చేశాం.

అర్బన్ హెల్త్ సెంటర్లలో రోజుకు ఎన్ని ఒపిలు జరుగుతున్నాయి..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : రోజుకు 50 నుండి 60 వరకు ఒపిలు జరుగుతున్నాయి. వైద్య సేవలు బాగా అందిస్తున్నాం. ప్రతి నెలా 9వ తారీఖున గర్భిణులకు హెల్త్ చెకప్‌లు చేస్తున్నాం.

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : అర్బన్ హెల్త్ సెంటర్‌లలో వైద్య సిబ్బంది, వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. అలాగే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జనరల్ మెడిషిన్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, జనరల్ పిజీషియన్ వంటి వైద్యులు అర్బన్ హెల్త్ సెంటర్ ను సందర్శించి వైద్య సేవలు అందిస్తారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఎన్ని రకాల వైద్యమ పరీక్షలు నిర్వహిస్తున్నారు..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఈసిజి, ఎల్‌ఎఫ్‌టి హెల్త్ ప్రొఫైల్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, హెచ్‌ఐవి వంటి 20 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈజీసి టెస్టులు కూడా అర్బన్ హెల్త్ సెంటర్లలో నిర్వహిస్తున్నాం. ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్, హరిజన వాడలోని అర్బన్ హెల్త్ సెంటర్లో ఆల్ట్రాసౌండ్ పరీక్షలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నాం. వచ్చేది వర్షాకాలం కాబట్టి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నీటిని కాచి చల్లార్చి వడబోసిన తర్వాతనే తాగాలి. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. శానిటేషన్‌పైన దృష్టి పెడుతున్నాం. ఎల్‌సిడి, ఫీవర్ సర్వే ఇంటింటికి తిరిగి ఆశాలు, ఏఎన్‌ఎంలు చేస్తారు. సర్వే జరుగుతుంది.

వ్యాక్సినేషన్ ఏఏ వారాల్లో జరుగుతుంది..? నెలలో ఎన్నిసార్లు వ్యాక్సినేషన్ కార్యక్రమం ఉంటుంది..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ప్రతి నెల బుధవారం, శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుంది. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు.

విలేజ్ అండ్ న్యూట్రిషన్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ : ప్రతి 2వ శుక్రవారం విలేజ్ అండ్ న్యూట్రిషన్ పైన గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు న్యూట్రిషన్ ఆహారం అందిస్తున్నాం.

నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాధికారులందరూ ఉదయం 9-30 గంటలకు హాజరుకావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పూజలు చేస్తున్న ఎన్నికల అధికారి దంపతులు

సంగమేశ్వరుడి సన్నిధిలో ఎన్నికల అధికారి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమతీరంలో వెలసిన సంగమేశ్వరుడిని ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా వారు సంగమేశ్వరాలయంలో వెలసిన వేపదారు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. పురాతన ఆలయాలు భక్తి భావనకు, ఆధ్యాత్మికతకు మారుపేరని అన్నారు. ఆయన వెంట విఆర్ఓ మౌలాలి, పలువురు ఉన్నారు.

అనారోగ్యంతో విఆర్ఎ మృతి



విఆర్ఎ పెద్దదస్తగిరి (ఫైల్)

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి విఆర్ఎ పెద్ద దస్తగిరి (56) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న విఆర్ఒలు శ్రీనివాసులు, మదన్, విశ్వనాథ్‌లు, మండల విఆర్ఏల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ గఫార్‌లు విఆర్ఎ ఇంటికి చేరుకుని పెద్దదస్తగిరి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వ సహాయం కింద రూ.25 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఎలు ఆనంద్, వేణు, నరసింహ, మహబూబ్‌భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరంలోని మోడల్ పాఠశాలలో ఆదివారం 6వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర మాట్లాడుతూ 6వ తరగతి ప్రవేశ పరీక్షలకు 78 మంది విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షకు 67 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారని అన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మెరిట్ ప్రకారం పాఠశాలలో చేర్చుకుంటామని తెలిపారు.

ఎస్ఐను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శరత్ కుమార్ రెడ్డిని టిడిపి నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ఐని కలిసిన వారిలో ఎస్సీ సెల్ నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, రుద్రవరం గ్రామపంచాయతీ వార్డు మెంబర్ సుంకన్న, జెసిబి దాస్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐకు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

ఎపికి బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం

- అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం నిరసన

ఆర్‌టిసి బస్టాండ్ ముందు కర్నూల్-గుంటూరు రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆదివారం విశాఖపట్నంలో జరిగిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. తొమ్మిదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన విద్రోహాన్ని ఈ సందర్భంగా ఎండగట్టాలని ప్రజలను కోరారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు పలు హామీలను ఇచ్చిందని తెలిపారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ అంటూ మభ్యపెట్టి ప్యాకేజీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. విభజన చట్టంలోని హామీలన్నింటినీ నామమాత్రంగా అమలు చేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారన్నారు. వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక నిధుల గురించి పట్టించుకోలేదని, పోలవరం నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను విడుదల చేయకుండా రెండు లక్షల మంది పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వరంగ సంస్థ విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందన్నారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా మోడీ ప్రభుత్వం పెడచెవిన పెడుతూ ప్రైవేటీకరణకు మొగ్గు చూపడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో పండగలను ఆసరా చేసుకుని మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయతుం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ రాష్ట్రాల హక్కులను హరించి వేస్తోందని విమర్శించారు. నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. నూతన ఆర్థిక విధానాలను దూకుడుగా అమలుచేస్తూ దేశ సంపదను కార్పొరేట్‌లకు దోచిపెడుతుందని అన్నారు. రాష్ట్రానికి సంబంధించి ప్రతి అంశంలో మోసం చేసిన నరేంద్రమోడీ ప్రభుత్వానికి రాష్ట్రంలో తొమ్మిదేళ్ల వార్షికోత్సవ వేడుకలను జరుపుకునే హక్కు లేదన్నారు. రాష్ట్రానికి మోసం చేస్తూ ఇలాంటి కార్యక్రమాలను జరపాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అమిత్‌షా పర్యటన పట్ల నిరసనలను వ్యక్తం చేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రాభివృద్ధిని కోరుకునే వ్యక్తులు, పార్టీలు నిరసనలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.సుధాకర్, మాబాష, ఏ.సురేంద్ర, షైక్ ఇస్మాయిల్, వీరన్న, శివుడు, రవి, శాలు, రఫీ, హుస్సేన్ బాషా, మల్లయ్య, మహమ్మద్, వలి, బాలేశ్వర్ రెడ్డి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహణలో రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 19 సంవత్సరాల లోపు ఓపెన్ ఫిడే రేటింగ్ చదరంగం పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు, నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్, నంద్యాల జిల్లా సంఘం చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెవివి.శర్మ, శాంతి నికేతన్ విద్యా సంస్థల ముఖ్య సలహాదారులు సుధాకర్, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ కశెట్టి చంద్రశేఖర్, ఆంధ్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి, నంద్యాల జిల్లా కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ కోశాధికారి రత్న కుమార్ అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ప్రథమ స్థానం విశాల్ చౌదరి (తిరుపతి), ద్వితీయ స్థానం ధ్రువేష్ (గుంటూరు), తృతీయ స్థానం సాత్విక్ (కోనసీమ జిల్లా), నాలుగవ స్థానం స్నేహిల్ (గుంటూరు). సాధించి ట్రోఫీలు, నగదు బహుమతి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరు జాతీయస్థాయి చెస్ పోటీలలో రాష్ట్రం తరపున పాల్గొంటారని ఆంధ్ర చెస్ సంఘం అధ్యక్షులు కెవివి శర్మ ప్రకటించారు. వివిధ వయసు కేటగిరిలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు ఇమామ్, నాగశ్రీనిష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల విజేతలతో ముఖ్య అతిథులు

కుమ్మరి మహేశ్వరికి ఆర్థిక సాయం చేస్తున్న కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు కుమ్మరి సురేష్ బాబు తదితరులు

మహిళకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - బనగానపల్లె

సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన శాలివాహన మహిళ కుమ్మరి మహేశ్వరికి కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షులు కుమ్మరి సురేష్ బాబు, నాయకులు రూ. 11 వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కుమ్మరి సురేష్ బాబు మాట్లాడుతూ గత నెలలో నొస్సం గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్వరి, జితేంద్రలు నంద్యాల మండలం సాంబవరం మెయిన్ హైవే రోడ్డు దగ్గర మోక్ష సాయి పవిత్రోత్సవాలకు వెళ్లి మెట్లపై నుండి కిందికి జారి పడి వెన్నుముక విరిగిందన్నారు. కుమ్మరి మహేశ్వరికి ఆపరేషన్ చేసినా మంచానికే పరిమితం కావడంతో ఆమె కుటుంబానికి కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసహాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు శివరాం, నాగరాజు, చిన్నయ్య, మహేష్, రఘురాముడు, బాబాయ్య వెంకటసుబ్బయ్య, గుర్రప్ప, జ్యోతిశ్వరుడు, నాగభూషణం, శివరామకిట్టు, గోవిందిన్నె సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

12 నుండి విద్యార్థులకు బస్ పాసులు : ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

నూతన విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్న నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు బస్ పాసులు మంజూరు చేస్తున్నట్లు ఆర్టీసీ డిఎం తిరుపతయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 12 సంవత్సరాలలోపు బాలురకు, 18 సంవత్సరాలలోపు బాలికలకు ఉచిత బస్ పాస్‌లు ఇస్తామన్నారు. దరఖాస్తును పూర్తి చేసి స్టడీ సర్టిఫికెట్, ఫొటోతో పాటు నిర్ణీత రుసుం చెల్లించి బస్ పాస్ పొందవచ్చన్నారు. అలాగే ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు సీజన్ పాసులు జారీ చేస్తామన్నారు.

నేడు ఉచిత సామూహిక హోమం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని దేవస్థానం ధర్మ ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత సామూహిక సేవలలో భాగంగా నేడు మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన సామాన్య భక్తులకు నెలలో ఒక రోజున సామూహిక ఉచిత సేవ నిర్వహించుకునేందుకు దేవస్థానం అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రతి నెలలో ఒక రోజు నిర్వహించే ఈ ఉచిత సేవా కార్యక్రమంలో 250 మందికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ ఉచిత సేవా కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ముందుగా దేవస్థానం వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ హోమంలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి అలంకారదర్శనం, అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. పాల్గొన్న సేవాకర్తలకు రెండు లడ్డు ప్రసాదాలు, కుంకుమ విభూది, కైలాస కంకణం, శ్రీశైల ప్రభ మాసపత్రిక అందజేస్తారన్నారు. దర్శనానంతరం అన్నపూర్ణ భవనంలో భోజన ప్రసాదాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వికలాంగులకు ఉచితంగా మందులు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నంద్యాల వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 20 మంది వికలాంగులకు దీర్ఘకాలిక వ్యాధులకు నెలవారి అవసరమైన రూ. 10 వేలు విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ వికలాంగులకు దీర్ఘకాలిక జబ్బులకు ప్రతినెలా అవసరమైన మందులను అనేక సంవత్సరాలుగా ఉచితంగా అందచేస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ కశెట్టి చంద్రశేఖర్, కార్యదర్శి కూర ప్రసాద్, కోశాధికారి రత్న కుమార్, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక జబ్బులకు మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ నాయకులు కశెట్టి చంద్రశేఖర్, కూర ప్రసాద్, రత్నకుమార్‌లు

ఢీ-15 సీజన్ విజేత మధుకృష్ణను సన్మానిస్తున్న బీసీ ఇందిరా

ఢీ-15 విజేతకు సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

ఈటీవీ ఢీ-15 సీజన్ విజేత మధు కృష్ణను పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి నివాసంలో ఆయన సతీమణి, థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బిసి ఇందిరా ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణానికి చెందిన మధు కృష్ణ ఈటీవీ ఢీ-15వ సీజన్ విజేతగా నిలవడం గర్వకారణమన్నారు. పట్టణంలోని వన్ వే డ్యాన్స్ స్టూడియోలో గత నాలుగు సంవత్సరాలుగా మాస్టర్ అనిల్, డీజే మధు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మధు కృష్ణ ఢీ-15 విజేతగా నిలవడం బనగానపల్లె నియోజకవర్గానికి గర్వకారణమని తెలిపారు. మధుకృష్ణకి తమవంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. రాష్ట్రస్థాయి డాన్స్ పోటీల్లోనే కాకుండా జాతీయ స్థాయి పోటీల్లో కూడా మధు కృష్ణ రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని సింగనపల్లె గ్రామానికి చెందిన మిద్దె శిరోమణి (53) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సింగనపల్లె గ్రామానికి చెందిన మిద్దె శిరోమణి కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో స్వీపర్‌గా కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నారు. శనివారం పనిలో భాగంగా పనులు ముగించుకొని రాత్రి 10 గంటల సమయంలో తన కుమారుడు ఓబులపతితో కలిసి బైక్‌పై సింగనపల్లె గ్రామానికి వస్తుండగా ఆకుమల్ల-సింగనపల్లె గ్రామాల మధ్యలో గాలికి రోడ్డుపై విరిగిపడిన చెట్టును గమనించి తప్పించబోయి బైకు అదుపు తప్పడంతో కిందపడ్డారు. దీంతో బైక్ వెనక కూర్చున్న శిరోమణి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయంపై పెద్ద కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

పే స్కేల్ అమలయ్యే వరకూ పోరాడుతాం

- సిఐటియు, విఆర్ఎల సంఘం నేతలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేసే వరకూ పోరాటాలు చేపడతామని విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి భూపాలు, సిఐటియు నాయకులు రణధీర్ తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు ఆఫీసులో విఆర్ఎల సంఘం ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ కమిటీ సమావేశం పాములపాడు పరమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు వైసిపి ప్రభుత్వం వచ్చిన వారంలోపే విఆర్ఎలకు పేస్కేలు, 55 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటిలో ఒకరికి ఉద్యోగం, ప్రమోషన్లు కల్పిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. తెలంగాణ విఆర్ఎల కన్నా ఎపిలో ఉన్న విఆర్ఎల జీవితాలలో వెలుగు నింపుతానని సిఎం జగన్మోహన్ రెడ్డి హామీనిచ్చి గాలికి వదిలేశారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ విఆర్ఎలకు పేస్కేలు, 55 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటిలో ఒక రికి ఉద్యోగం, ప్రమోషన్ కల్పిస్తూ క్యాబినెట్ ఆమోదం చేసి వారి జీవితాలలో వెలుగు నింపారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన విధంగానే మొన్న జరిగిన ఎపి క్యాబినెట్ మీటింగ్‌లో చేస్తారని కోటి ఆశలతో ఎదురుచూసిన విఆర్ఎలకు సిఎం నిరాశకు గురి చేశారన్నారు. మాటిచ్చి మడమతిప్పిన జగన్మోహన్ రెడ్డి విఆర్ఎల సమస్యలు పరిష్కారం చేసేంత వరకు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ నాయకులు శ్రీనివాసులు, రవి, రామలింగప్ప, భాగ్యమ్మ, మౌలాలి, అమ్మని, బూషన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్

రూ. 100 కోట్లు విలువైన

శేషారెడ్డి పాఠశాల కథ ఏమిటి బుగ్గన..?

- టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-డోన్

'బేతంచర్లలో రూ.100 కోట్లు విలువ చేసే శేషారెడ్డి ఉన్నత పాఠశాల కథ ఏమిటి మంత్రి బుగ్గన' అని టిడిపి డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి నిలదీశారు. ఆదివారం డోన్ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'డోన్ పట్టణంలో ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ప్రారంభం చేయడమే కాదు బుగ్గనా, మా తాత దాన కర్ణుడు అంటూ నువ్వు శేషారెడ్డి ఉన్నత పాఠశాలను రెండు లక్షల కొద్ది క్యాలెండర్లలో వేసి పబ్లిసిటీ చేసుకొని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచావు. ఆ తరువాత దాదాపు 100 కోట్లు విలువ చేసే శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాపర్టీని అధికార దుర్వినియోగంతో వెనక్కి తీసుకొని డోన్ నియోజకవర్గం ప్రజలందరినీ మోసం చేశావు. రూ. 100 కోట్ల విలువ చేసే ప్రాపర్టీని నీ సొంతం చేసుకున్నావు. డోన్ నియోజక వర్గ ప్రజలు నిన్ను క్షమించే పరిస్థితుల్లో లేరు. అభివృద్ధి ముసుగులో నువ్వు చేసిన అక్రమాలు అన్నీ డోన్ నియోజక వర్గ ప్రజలకు తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నాను. నువ్వు చెప్పే కథలన్ని నమ్మే పరిస్థితిలో డోన్ నియోజకవర్గ ప్రజలు లేరు' అని ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు.

బుగ్గన శేషారెడ్డి ఉన్నత పాఠశాలను చూపిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

రొట్టె, పప్పు, గుడ్డు బలవర్ధక పౌష్టికాహారం

ప్రజాశక్తి-డోన్

రొట్టె, పప్పు, గుడ్డు రోగులకు మంచి పౌష్టికాహారమని హోసన్నా వృద్ధాశ్రమం నిర్వాహకులు జాన ప్రభాకర్ అన్నారు. ఆదివారం డోన్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో రోగులకు, గర్భవతులకు, బాలింతలకు బావిపల్లె రెడ్డి జనార్ధన్ ఆర్థిక సహాయంతో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నమెంట్ హాస్పిటల్‌కు డోన్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు ఏదో ఒక అనారోగ్యంతో వస్తూ ఉంటారని, రోగులను వదిలిపెట్టి బయటికి వెళ్లలేక ఆకలితో అలాగే ఉంటారని తెలిపారు. అటువంటి వారికి ఈ రొట్టె, పప్పు, గుడ్డు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. దాతల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాలు చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్, హోసన్న వృద్ధాశ్రమం సూపర్వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్

అక్రమంగా కెసి కెనాల్ కట్ట మట్టి తరలింపు

- చూసీ చూడనట్లుగా అధికారులు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం జూటూరు గ్రామ పరిధిలో కెసి కినాల్ 111వ కిలోమీటర్ల వద్ద జూటూరు గ్రామానికి చెందిన ఓ నాయకుడు కెసి కెనాల్ కట్ట మట్టిని పొలానికి అక్రమంగా తరలించుకుంటున్నాడు. నాలుగైదు రోజుల క్రితం రాత్రిపూట జెసిబి మిషన్ పెట్టి సుమారు వందల ట్రిప్పుల మట్టిని పొలానికి తరలించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మట్టిని అక్రమంగా తరలించడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. మట్టిని తరలించడంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టిని తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు. ఈ విషయంపై కెసి కెనాల్ ఏఈ శ్రీనివాస నాయక్‌ను వివరణ కోరగా కెనాల్ కట్టకు దూరంలో ఉందని, తమకు సంబంధం లేదని, మైనర్ ఇరిగేషన్ శాఖకు సంబంధమని చెప్పడం గమనార్హం.

అక్రమంగా తవ్విన మట్టి

శ్రీశైల క్షేత్రంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

రెండవ శనివారం, ఆదివారం రెండు సెలవు దినాలు కలిసి రావడంతో శ్రీశైలం క్షేత్రంలో భక్తుల రద్దీ బాగా పెరిగింది. శ్రీశైలం క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాఠశాలలకు సెలవులు ముగుస్తుండడం, రాష్ట్రంలో ఎండలు తగ్గి చల్లబడడంతో తెలుగు రాష్ట్రాల నుండి కాక పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకొని స్వామి అమ్మవారిను దర్శించుకుంటున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుండి స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండి దర్శించుకుంటున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిని ఇచ్చారు. భక్తులు అడిగినన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచామని దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్న కమ్యూనిటీ సత్రాలు, దేవస్థానం గదులు, కాటేజీలు భక్తులతో నిండిపోయాయి. ఇంకా అనేక మంది భక్తులు గదులు దొరకక ఇబ్బందులు పడ్డారు.

క్యూ లైన్‌లో ఉన్న భక్తులు

ఉచిత యోగా శిక్షణను వినియోగించుకోండి

ప్రజాశక్తి - డోన్

గీతా యోగాసన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే యోగా ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని యోగా గురూజీ పుల్లయ్య తెలిపారు. ఆదివారం గీతా యోగాసన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని డోన్ డిఎస్‌పి వై.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డోన్ డిఎస్పి వై.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తూ ఎందరో విద్యార్థులకు, అన్ని సమస్యల వారికి ఆరోగ్యాన్ని ప్రసాదించే యోగాను సాధన చేయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రస్తుత సమాజంలో మానసిక ఒత్తిడి వల్ల వచ్చే రుగ్మతలను యోగా ద్వారా అధిగమించవచ్చని పేర్కొన్నారు. యోగా చేసి ప్రతి ఒక్కరూ ఒత్తిడిని జయించాలని తెలిపారు. మానసిక ప్రశాంతత, ఆనందంగా జీవించడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటువంటి గొప్ప కార్యక్రమం చేపడుతున్న గీతా యోగాసన సంఘం గురూజీ పుల్లయ్యకి కార్యవర్గ సంఘం సభ్యులను అభినందించారు. అనంతరం యోగా గురూజీ పుల్లయ్య, సీనియర్ న్యాయవాది ఎం నాగభూషణం రెడ్డిలు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గీతా యోగాసన సంఘం 40వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత యోగా శిక్షణ తరగతులు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఎస్‌కెపి హైస్కూల్‌లో హైదరాబాద్ వాస్తవ్యులు రమేష్ గురూజీ చేత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీ గరికపాటి గురజాడ ప్రసంగం మధు ఫంక్షన్ హాల్‌లో ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని బైక్ ర్యాలీ ద్వారా పట్టణ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం గీతా యోగాసన సంఘం సభ్యులు డిఎస్‌పిని ఘనంగా సన్మానించారు.

డిఎస్‌పి వై.శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న గీతా యోగాసన సంఘం సభ్యులు

డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి మంత్రి భూమి పూజ

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం సమీపంలో రూ. 40 లక్షలతో చేపడుతున్న నూతన డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం బేతంచెర్ల మండల ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మార్పులను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ సాంకేతికతో కూడిన డిజిటల్ లైబ్రరీ నిర్మాణానికి వైసిపి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. భవిష్యత్తులో బేతంచర్ల పట్టణం అవుతున్నందున విద్యావంతులు, విద్యార్థులు డిజిటల్ లైబ్రరీ సేవలు వినియోగించుకొని విజ్ఞానం సంపాదించుకునేందుకు ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ మధుశేఖర్, బేతంచర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తుజావలి, మాజీ వైస్ ప్రెసిడెంట్ కాజా హుస్సేన్, తిరుమలేశ్వర్ రెడ్డి, బాబుల్ రెడ్డి, గూని నాగరాజు, రామనాయుడు, వెంకటేశ్వర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన

ముగిసిన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - పగిడ్యాల

గత నెల 8 నుంచి ప్రారంభమైన గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసిందని గ్రంథాలయ అధికారిణి కె.మద్దమ్మ తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి పుల్యాల దివ్య, సర్పంచి పెరుమాళ్ళ శేషన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలు వేసవికాలంలో ఇంటి వద్ద ఉండకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవడం మంచి పరిణామం అన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు, వార్తాపత్రికలు చదవాలన్నారు. పుస్తకాలు చదివినప్పుడే విజ్ఞానం పెంపొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు ఆటలు, పాటలతో కథల పుస్తకాలు చదివించడం, విజ్ఞానానికి పెంపొందించేందుకు అవసరమైన పుస్తకాలను చదివించినట్లు తెలిపారు. అనంతరం జడ్పిటిసి, సర్పంచులు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. **పాణ్యం :** పాణ్యంలోని గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఇఒ కోటయ్య హాజరై మాట్లాడారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలను మర్చిపోకుండా తరగతి గదిలో వాటిని ప్రదర్శిస్తూ మిగతా పిల్లలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని భాగ్యలక్ష్మి, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కౌసల్య, ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, సుబ్బారెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రాఘవరెడ్డి మాట్లాడారు. వివిధ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు వెంకటరామి రెడ్డి, అబ్దుల్ రశీద్‌లు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సిబ్బంది బెల్జియార్, రజియాబి పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** బండి ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ గ్రంథాలయ అధికారి మధు, గ్రామపంచాయతీ 14వ వార్డు మెంబర్ కొర్రపాటి మురళి బాబులు అందజేశారు. గ్రంథాలయ అధికారి మధు మాట్లాడారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి ఎంతగానో దోహదపడిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శకుంతల, శెట్టి, భాష, పాఠకులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరులో బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్లలో బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పగిడ్యాలలో బహుమతులు పంపిణీ చేస్తున్న జడ్పిటిసి, సర్పంచి

పాణ్యంలో..

కొత్తపల్లిలో బహుమతులు పంపిణీ చేస్తున్న సర్పంచి

మహారాజశ్రీ బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO.238/2022

గోట్లపాటి చిన్న వెంకటేశ్వర్లు. ...వాది

-ఎదురు-

నర్ల సోమేశ్వర రెడ్డి మరియు Died by Lr's
1.నర్ల శిల్పా W/o లేట్ నర్ల సోమేశ్వర రెడ్డి,
వయస్సు 40 సం॥
2.నర్ల అరణ రెడ్డి, S/o లేట్ నర్ల సోమేశ్వర రెడ్డి,
వయస్సు 24 R/o. కాశీపురం గ్రామం,
అవుకు మండలం, నంద్యాల జిల్లా. ...ప్రతివాదులు

ప్రతివాదులకు దావా సమన్లు

పై నంబరులోని వాది దగ్గర నర్ల సోమేశ్వర రెడ్డి, 1వ ప్రతివాదికి భర్త మరియు 2వ ప్రతివాదికి నాన్న తన జీవిత కాలములో వాది నుండి అప్పుగా తీసుకొని దావా ప్రాంసరినోటును వ్రాయించి ఉన్నాడు. ప్రాంసరి బాకీ బాపతు ఎలాంటి మొత్తము చెల్లించలేదు. కావున వాది దావా మొత్తము. రాబట్టు కొనుటకై సదరు నర్ల సోమేశ్వర రెడ్డి గారి వరసత్వులు అయిన మీ పై దావా వేసి ఉన్నాడు. కావున మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల 14.06.2023 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గాని మీ న్యాయవాది ద్వారా కానీ హాజరయి మీ అప్పుగా తీసుకొని దావా ఆక్షిపణలును తెలుపుకొనుటవలయును. లేని యెడల సదరు దావా మీ పరీక్షలన విచారించి తీర్మానిం చబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు).

వాయిదా: 14.06.2023

యస్.యం.డి.అల్లాఉద్దీన్.,
జి.వెంకట రాముడు,
వాదిపరం అడ్వకేట్స్, బనగానపల్లె.

మహారాజశ్రీ బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.NO.809/2022 IN O.S.NO.238/2022

గోట్లపాటి చిన్న వెంకటేశ్వర్లు. ...వాది

-ఎదురు-

నర్ల సోమేశ్వర రెడ్డి మరియు Died by Lr's
1.నర్ల శిల్పా, W/o. లేట్ నర్ల సోమేశ్వర రెడ్డి,
వయస్సు 40 సం॥
2.నర్ల అరుణ రెడ్డి, S/o. లేట్ నర్ల సోమేశ్వర రెడ్డి,
వయస్సు 24 సం॥, R/o. కాశీపురం గ్రామం,
అవుకు మండలం, నంద్యాల జిల్లా. ...ప్రతివాదులు

నోటిస్ అండర్ ఆర్డర్ 38 రూల్ 5 ఆఫ్ సి.పి.సి.

ఇందుములముగా ప్రతివాదులకి తెలియ జేయడమేమనగా, పై కోర్టు లో క్రింద కనపరచిన షెడ్యూల్ దాఖాలా ఆస్తిని అటాచ్మెంట్ (జప్తు) చేయుటకు I.A.No.809/2022కు నోటిస్ ఇవ్వడం జరిగింది. కావున మీరు 14.06.2023 వ తేదిన బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు లో స్వయంగా గాని, వకీలు ద్వారా కాని హాజరుకాగలరు. లేనియెడల మీ పరోక్షముగ తీర్మానించ బడును.

వాయిదా: 14.06.2023

SCHEDULE

Landed property situated in Nandyal Distinct, Banaganapalle Sub-Registration District, within the limits of Sunkesula Village, Owk Mandal, Nandyal District within the following particulars;
Survey Number: 345 Extent: Ac.11.24 Cents
BOUNDARIES (as per Encumbrance Certificate)
తూర్పు : బి.రామచంద్ర రెడ్డి గార్ల భూమి
పడమర : సి.వెంకటేశ్వర రెడ్డి గార్ల భూమి
ఉత్తరం : జి.రాఘవరెడ్డి గార్ల భూమి
దక్షిణం : సామెలు భూమి,

ఇట్లు
యస్.యం.డి.అల్లాఉద్దీన్,
జి.వెంకట రాముడు,
వాదిపరం అడ్వకేట్స్, బనగానపల్లె.